APTEL 2023/16425

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260


ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 152 శనివారం 30 డిసెంబర్ 2023 పేజీలు 4. వేల :4 /

# మనిషి తలరాతను మార్చే శక్తి కేవలం విద్యకి మాత్రమే ఉంది- సీఎం జగన్

**-మూడుసార్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తుకు వస్తుందా?: సీఎం జగన్**

**-దత్తపుత్రుడు ఓ త్యాగాల తాగ్యరాజు.. చంద్రబాబు కోసమే పవన్ జీవితం.**



ఆంధ్ర ప్రగతి భీమవరం డిసెంబర్ 29: "మన రాష్ట్రంలో పిల్లలు గొప్పగా చదవాలని విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాము" అని సీఎం జగన్ పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో భాగంగా 2023%--%24 విద్యా సంవత్సరంలో జూలై%--%సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి అర్హులైన 8,09,039 మంది విద్యార్థులకు రూ.584 కోట్ల నిధులను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.

మిగతాది 3లో...

# 'రెడ్ బుక్' పై నారా లోకేశ్‌కు సీఐడీ నోటీసులు

యువగళం పాదయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ యువనేత నారా లోకేశ్ చేతిలో ఓ ఎర్రని పుస్తకం ఉండడం తెలిసిందే. తమను, తమ పార్టీ క్యాడర్ ను ఇబ్బందిపెట్టిన పోలీసులు, అధికారులు, నేతల పేర్లను ఆ రెడ్ బుక్ లో రాసుకుంటున్నానని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాళ్ల సంగతి తానే స్వయంగా చూసుకుంటానని లోకేశ్ పలు సందర్భాల్లో చెప్పారు. తాజాగా, ఈ రెడ్ బుక్ అంశంలో నారా లోకేశ్ కు ఏపీ సీఐడీ నోటీసులు పంపింది. రెడ్ బుక్ పేరుతో తమను బెదిరిస్తున్నారంటూ కొందరు అధికారులు ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. అధికారుల పిటిషన్ పై విచారణ చేపట్టిన ఏసీబీ న్యాయస్థానం రాష్ట్ర సీఐడీకి సూచనలు చేసింది. న్యాయస్థానం సూచన మేరకు సీఐడీ అధికారులు లోకేశ్ కు వాట్సాప్ ద్వారా నోటీసులు పంపించారు. నోటీసులు అందుకున్నట్టు వాట్సాప్ లో సీఐడీకి లోకేశ్ బదులిచ్చారు. కాగా, అధికారుల పిటిషన్ పై విచారణను ఏసీబీ కోర్టు జనవరి 9కి వాయిదా వేసింది



# ఏపీ వైద్య ఆరోగ్యశాఖకు కేంద్రమంత్రి ప్రశంసలు

ఏపీ వైద్య ఆరోగ్య శాఖ పనితీరు భేష్ అంటూ కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రశంసల వర్షం కురిపించారు. ఏపీ సీఎం జగన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి విడదల రజనిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య రంగంపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ఏపీకి సంపూర్ణ సహకారం అందిస్తామని మన్సుఖ్ మాండవీయ చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఆరోగ్యవంతమైన ప్రజలతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మన్సుఖ్ మాండవీయ ఇవాళ విజయవాడ జీజీహెచ్ లో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆరోగ్య మంత్రి విడదల రజని, టీడీపీ ఎంపీ కేశినేని నాని, స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# టీడీపీ కంచుకోట కుప్పం

**- వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యం -టీడీపీ అధినేత చంద్రబాబు**

అమరావతి,డిసెంబర్29 :

కుప్పం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే కుప్పంలో అభివృద్ధి జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో చంద్రబాబు రెండోరోజు పర్యటిస్తున్నారు. కుప్పం ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద ప్రజలనుంచి వినతులను స్వీకరించి.. శాంతిపురం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం కుప్పం నియోజకవర్గానికి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలో ఉంటే కుప్పంలో హంద్రీనీవా ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందిచేవారమని చంద్రబాబు పేర్కొన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి హంద్రీనీవా ప్రాజెక్టును 87 శాతం పూర్తి చేస్తే.. మిగతా 13 శాతం కూడా పూర్తి చేయని దద్దమ్మ ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని దుయ్యబట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఇంతవరకూ.. ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదని యద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతన్నలను ప్రోత్సహించేందుకు ఏ కార్యక్రమమైనా చేపట్టారా అని చంద్రబాబు ప్రశ్నించారు. ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశం వైసీపీ నాయకులకు లేదని, ప్రజల్ని దోచుకోవడమే వాళ్ల పని అని విమర్శించారు. ఇసుక, భూములు, మద్యం, నీళ్లపై వీళ్ల కన్ను పడితే మటాష్ అయిపోతాయన్నారు. వైసీపీ నేతలంతా దొంగలు, గజదొంగలని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక దోచుకున్న డబ్బంతా కక్కిస్తానన్నారు.



# అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి హాజరవుతున్న సోనియాగాంధీ



జనవరి 22న అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరుకావాలంటూ అన్ని పార్టీల ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయి. వివిధ రంగాలకు చెందిన దాదాపు 6 వేల మంది ప్రముఖులను ఆహ్వానించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, అధిర్ రంజన్ చౌదురీలకు కూడా ఇన్విటేషన్లు అందాయి. ఈ కార్యక్రమానికి సోనియాగాంధీ హాజరయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. మతపరమైన కార్యక్రమం కావడంతో సోనియా ఎలా రియాక్ట్ అవుతారో అని చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారు. అయితే, ఆమె హాజరవుతున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో రామ మందిరం ప్రారంభోత్సవం ప్రాధాన్యతను సంతరించుకుంది


# 2024 ఎన్నికలలో హ్యాట్రిక్ కొడతాం: పిఎం మోడీ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో దేశ ప్రజలకు భారతీయ జనతా పార్టీ సహజ ఎంపిక కానున్నదని ప్రధాని నరేంద్ర మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు.

సంకీర్ణ ప్రభుత్వం దేశానికి అవసరం లేదన్న ఏకాభిప్రాయానికి ప్రజలు వచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి హ్యాట్రిక్ విజయాన్ని సాధించనున్నదని ఆత్మవిశ్వాసంతో చెబుతున్న మాటలు కావని, సంకీర్ణ ప్రభుత్వాల హయాంలో పాలన కొరవడిందన్న వాస్తవాన్ని ప్రజలు ప్రత్యక్షంగా చూశారని ఇండియా టుడే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీ తెలిపారు. మన దేశానికి సంకీర్ణ ప్రభుత్వం అవసరం లేదని ప్రజలు,నిపుణులు, మేధావులు, మీడియాలోని మిత్రులలో సైతం ఏకాభిప్రాయం ఏర్పడిందని ఆయన అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాల ఫలితంగా ఏర్పడిన అస్థిరతతో దేశం 30 ఏళ్లు కోల్పోయిందని ఆయన వ్యాఖ్యానించారు. పాలనారాహిత్యం, బుజ్జగింపు రాజకీయాలు, అవినీతి వంటివన్నీ సంకీర్ణ ప్రభుత్వాల హయాంలో దేశ ప్రజలు చూశారని ఆయన చెప్పారు. గతంలో ప్రజలలో విశ్వాసాన్ని, ఆశావాదాన్ని కోల్పోయిన ఈ సంకీర్ణ ప్రభుత్వాల కారణంగానే 2024లో ప్రజలకు బిజెపి సహజ ఎంపిక కానున్నదని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ప్రజల సేవలో తన సర్వస్వాన్ని అర్పించడం ఒక్కటే తనకు తెలుసునని ఆయన అన్నారు.

బిజెపి పాన్ ఇండియా కాదనడం తప్పు:

బిజెపిని పాన్ ఇండియా(దేశవ్యాప్త) పార్టీ కాదని చిత్రీకరించడం సబబుకాదని ప్రధాని మోడీ అన్నారు. లోక్‌సభ సీట్లను పరిగణనలోకి తీసుకుంటే దక్షిణ భారతంలో బిజెపి ఏకైక అతిపెద్ద పార్టీగా ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలోని మొత్తం 545 సీట్లలో ప్రస్తుతం బిజెపికి 303 మంది సభ్యులున్నారు. అయితే కర్నాటక అసెంబీ ఎన్నికల తర్వాత ఆ పార్టీ ఐదు దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కడా అధికారంలో లేదు. మా పార్టీకి బలం లేని ప్రాంతమంటూ ఇప్పుడు ఈ దేశంలో ఎక్కడా లేదు. కేరళలో స్థానిక సంస్థల నుంచి అనేక రాష్ట్రాలలో ప్రధాన ప్రతిపక్షంగా మా పార్టీ ఉంది. ప్రజలతో మమేకమవుతూ మా పార్టీ నాయకులు విశేషంగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం వరకు కర్నాటకలో మా ప్రభుత్వం ఉంది. ఈనాటికి కూడా పుదుచ్చేరిలో మా ప్రభుత్వమే ఉంది. ప్రస్తుం 16 రాష్ట్రాలలో మా పార్టీ అధికారంలో ఉండగా 8 రాష్ట్రాలలో ప్రధాన ప్రతిపక్షంగా ఉంది అని మోడీ వివరించారు.బిజెపిని బ్రాహ్మణ-వైశ్య పార్టీగా, హిందీ రాష్ట్రాలకు పరిమితమైన పార్టీగా కొందరు విమర్శకులు వేస్తున్న ముద్రలను ఆయన కొట్టివేశారు. ప్రతి ఎన్నికలలోనూ ఈ ముద్రలు అబద్ధాలని నిరూపితమవుతోందని మోడీ చెప్పారు. క్రైస్తవ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలతోసహా ఈశాన్య రాష్ట్రాలలో సైతం బిజెపి జెండా ఎగరవేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2014లో ఉనికే లేని తాము ఆరు ఈశాన్య రాష్ట్రాలలో అధికారంలో ఉన్నామని, అందులో క్రైస్తవ జనాభా అధికంగా ఉండే నాగాలాండ్, మేఘాలయ కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. 1984లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలతో ప్రారంభమైన మా ప్రస్థానం నేడు 303 స్థానాలకు చేరుకుందని, దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజల మద్దతు లేకుండా జాతీయ రాజకీయాలలో ఇంత బలమైన శక్తిగా ఎదగడం ఎలా సాధ్యపడుతుందని మోడీ ప్రశ్నించారు



# ఎస్టీ సామాజికి వర్గానికి చెందిన 250 మంది టీడీపీని వీడి వైఎస్సార్సీపీలో చేరిక.

## -జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే యువతకు భవిషత్తు... ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 29: రాష్ట్రంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వంలోనే భవిషత్తు ఉందని.. ప్రధానంగా యువతకు న్యాయం జరుగుతుందని భావించిన నంద్యాల పట్టణం వైఎస్సార్ నగర్, నందమూరినగర్ ప్రాంతాలలోని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన యువత జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై అలాగే టీడీపీ నాయకుల నిర్లక్ష్యానికి గురికాబడిన వారు కేవలం జగనన్న, శిల్పాకుటుంబంతోనే తమకు న్యాయం జరుగుతుందని వైఎస్సార్సీపీలోకి చేరడం సంతోషంగా ఉందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే ఆద్వర్యంలో నాగరాజునాయక్, దీపక్ నాయక్ ఆద్వర్యంలో వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, మహిళలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీ భలోపేతానికి కృషిచేయాలని వారిని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నంద్యాల పట్టణం వైఎస్ నగర్, నందమూరి నగర్ ప్రాంతానికి చెందిన నాగరాజునాయక్, దీపక్ నాయక్ వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు వైఎస్సార్సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వీరంతా గతంలో టీడీపీలో ఉంటూ పార్టీకి పనిచేశారని, అయితే వీరిని టీడీపీ విస్మరించడంతో విసుగుచెంది పార్టీని వీడటం జరిగిందన్నారు. ప్రధానంగా యువత జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో తమ భవిషత్తు ఉందని గ్రహించారని, జగనన్నకు, శిల్పాకుటుంబానికి తమ మద్దతు ఉంటుందని తెలియజేయడం సంతోషంగా ఉందన్నారు. మొట్టమొదటిసారిగా యువతకు ఓటు హక్కు రావడం వారు భవిషత్తు ఉన్న వైఎస్సార్పార్టీలో చేరడం శుభపరిణామం అన్నారు. అలాగే 30వ తేది శనివారం నంద్యాలలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జయప్రకాష్ రెడ్డి, 38వ వార్డు ఇంచార్జ్ టివి రమణ, అప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, కౌన్సిలర్ మేసా చంద్రశేఖర్, శంకర్ నాయక్ వైయస్సార్ జోనల్ ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ పట్టణ అధ్యక్షులుగా కసెట్టీ చంద్రశేఖర్ నియామకం.

## ... బీజేపీ తీర్థం పుచ్చుకున్న అర్యవైశ్య మహిళలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 29: నంద్యాల పట్టణ బీజేపీ అధ్యక్ష్యులుగా కసెట్టి చంద్రశేఖర్ ను నియమించినట్లు జిల్లా బీజేపీ అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా వున్న బీజేపీ కార్యాలయం లో బీజేపీ అసెంబ్లీ కార్యకర్తల సమావేశానికి నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు,కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిదులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల బీజేపీ పట్టణ అధ్యక్షులుగా కసెట్టి చంద్రశేఖర్ ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. దేశంలో బీజేపీ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఆర్య వైశ్య మహిళలు పార్టీలో చేరడం సంతోషంగా వుందని బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నూనె పల్లె ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జక్కా రాజేశ్వరి,కాల్వ పద్మావతి, నిచ్చెన మెట్ల సుధా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కర్నూల్,నంద్యాల లో పార్టీ బలోపేతం చేయడానికి బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వార్డు,గ్రామాల్లో త్వరలో కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కసెట్టి కృష్ణమూర్తి,మాజీ కౌన్సిలర్ మేడా మురళీధర్,డాక్టర్ ఇంటి అధి నారాయణ,శ్రీ లక్ష్మి,స్వాతి,గంగాధర్ నియోజక వర్గంలోని ముఖ్య నాయకులు హాజరయ్యారు



# ఎన్నికల ఏర్పాట్ల నిర్వహణ పూర్తి చేసుకోండి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 29: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వచ్చే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు.

శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫారమ్‌లు, అనోమలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పోలింగ్ అధికారుల నియామకం, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఈరోల్‌పై రిపోర్ట్ లు, పీఎస్ఈలు, డీఎస్ఈలు, ఈవీఎంల భద్రతా గదులు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాని ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఇప్పటివరకు ఫారం-6,7,8 అన్ని దరఖాస్తులు కలిపి మొత్తం 857 పెండింగ్ లో వున్నాయని... వీటన్నింటినీ వెంటనే క్లియర్ చేయిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. అలాగే 43 జంక్ క్యారెక్టర్స్ వున్నవి,10 కంటే ఎక్కువ ఓట్లు వున్న 106 కుటుంబాలకు సంబంధించి ఇంటింటి సర్వేలో పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఓటర్ల జాబితాలో సవరిస్తామని కలెక్టర్ నివేదించారు. జిల్లాలో వున్న1621 పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల కల్పనపై పర్యవేక్షించి కొరతగా ఉన్న వాటిపై దృష్టి సారించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సంబంధిత తాసీల్దార్లను ఆదేశించామన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో డిస్పాచ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నామని.... జిల్లా కేంద్రంలో రిసెప్షన్ కేంద్ర ఏర్పాటుకు స్థలాన్ని అన్వేషిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా రెండు శాతం అదనంగా తొలగింపులు చేసి ఉంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. పోలింగ్ కు అవసరమయ్యే పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఇతరత్రా పోలింగ్ సిబ్బందిని నియోజకవర్గాల వారిగా గుర్తిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేసామన్నారు. జిల్లాలో 920 లొకేషన్ లలో 15,070 వికలాంగత్వ ఓటర్లు ఉన్నారని... వీల్ ఛైర్ల కొరత ఉన్నట్లు ఎన్నికల ప్రధాన అధికారికి కలెక్టర్ వివరించారు.

అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్ లో వున్న అన్ని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తయిన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా ఆయా జిల్లాలలోని అన్ని కళాశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు శ్రీనివాసులు, ఎం దాసు, వెంకటరెడ్డి, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికుల సమ్మె 4వ రోజు ఉరి తాళ్ళకు వేలాడుతూ...

ఆంధ్ర ప్రగతి డోన్ డిసెంబర్ 29: డోన్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం,మండల పట్టణ అధ్యక్షులుపి.రామాంజనేయులు,నక్కి శ్రీకాంత్,కోశాధికారి నాగమద్దయ్య,మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప,అధ్యక్ష, ఉపాధ్యక్షులు గోవిందు,పెద్ద ఎల్లయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా,అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలోనూ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్ కార్మికులను అందరినీ 6 నెలలలో పర్మినెంట్ చేస్తానని,సమాన పనికి సమాన వేతనం ఇస్తానని ప్రకటించారని అయితే అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటిన ఇచ్చిన హామీలు మాత్రం అమలు కాలేదని ప్రస్తుతం వస్తున్న వేతనాలు ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరల తో పోల్చితే కొని తినే పరిస్థితులు లేవని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా చేసిన మోసానికి కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియని దిక్కుతోచని పరిస్థితులలో కార్మికులు ఉరి వేసుకున్నారని చివరి క్షణాలలో గమనించి వారిని ప్రాణాలతో కాపాడుకున్నామని ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా కొనఊపిరితో ఉన్న మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులుదేవదానం,యేసు, హైమారావు,ఆవులయ్య,రామాంజి,చంద్ర,సురేష్ వెంకట లక్ష్మమ్మ,అంజనమ్మ, రంగనాయకులమ్మ,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 29:



ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కి వినతి పత్రం అందజేసినఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి నాగరాముడుఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగ రాముడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల 35 వేల పోస్టులు భర్తీ చేయాలని వీటితోపాటు గ్రూప్ 1,గ్రూప్ 2,అభ్యర్థులకు వయోపరిమితిని పెంచాలని అదేవిధంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3 వేల రూపాయలు ఇవ్వాలని , విద్యుత్ శాఖలో మరియు వ్యవసాయ పరిశోధన మరియు పశువు సంవర్ధ శాఖ పోస్టులను విశ్వవిద్యాలయాల లో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని అలాగే వైద్య ఆరోగ్యశాఖలో డాక్టర్స్, నర్సు, ల్యాబ్ టెక్నీషియన్స్ , అటెండర్లు, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు ,పోస్టులను భర్తీ చేయాలని స్థానిక నంద్యాల ఎమ్మెల్యే రవి కిషోర్ రెడ్డి కి వినతి పత్రం అందజేస్తూ వీటిని పైన తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి కి దృష్టికి తెలియజేయాలని నిరుద్యోగులకు అండగా ఉండాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంజి రవి విష్ణు స్వామి పాల్గొనడం జరిగింది.

# ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభలు జయప్రదం.




ఆంధ్ర ప్రగతి విజయవాడ డిసెంబర్ 29: ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ లో నంద్యాల జిల్లా విద్యార్థుల సమస్య లపై మాట్లాడుతున్న నంద్యాల జిల్లా సహాయక కార్యదర్శి బత్తిని ప్రతాప్ మాట్లాడుతూ , డోన్ మండలం లో సాంఘిక సంక్షేమ హాస్టల్లు అద్దె భవనాలలో విద్యార్థులు ఉంటున్నారు. అలాగే పాణ్యం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ కి, నాడు బినేడు పనులు తొందరగా పూర్తి చేయాలి. నాడు బినేడు పనులలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కటిన మైన చర్యలు తీసుకోవాలని, అలాగే జిల్లా పరిషత్ హై స్కూల్ కు కాంపౌండ్ వాల్ మధ్యలోఆగిపోయినందువలన స్కూల్ పరిధిలోని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారినది. గత 30 సంవత్సరాలుగా గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ కోసం విద్యార్థులతో పోరాటాలు చేయగా లాస్ట్ ఇయర్ డిగ్రీ కాలేజ్ వచ్చినది. అయితే డిగ్రీ కాలేజి జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణంలోనే రెండు రూములు తీసుకొని క్లాసులు నిర్వహిస్తూ కాలం గడుపుతూ ఉన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం 5 ఎకరాలు ఏర్పాటు చేసి కాలేజీ నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ ఉన్నాం. అలాగే ఏపీ మోడల్ స్కూలుకు, కేజీబీవీ స్కూల్, హాస్టల్ కు ప్రత్యేకమైన సీసీ రోడ్డు వెనక భాగంలో వేయాలని కోరుతూ ఈ స్కూల్ లకు వెళ్లాలంటే సుగాలి మెట్ట దగ్గర ఉన్నటువంటి నేషనల్ హైవే రోడ్డు దాటి వెళ్లాలి విద్యార్థులు ప్రాణాలు పోయే పరిస్థితి ఉన్నది. అందుకని ఈ యొక్క స్కూల్ కు అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టలని కోరారు. అలాగే ఒక గర్ల్స్ సంక్షేమ హాస్టల్, ఐటిఐ కళాశాల కూడా ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా బృందం అశోక్, తేజ, మధు, ఇమ్రాన్ పాల్గొన్నారు.

# అంగన్వాడీల పోరాట పటిమకు రాష్ట్ర ప్రభుత్వం దిగి రాక తప్పదు

**సిఐటియు జిల్లా నేత ఎం. మోహన్ రావు విమర్శ.**

ఉలవపాడు,
రాష్ట్ర ప్రభుత్వం తాము ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు అంగన్వాడీలు మొక్కవోని దీక్షతో పోరాడుతున్నారని, వారిపట్టుదలతో గత 18 రోజులుగా అంగన్వాడీల పోరాటానికి ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని సిఐటియు నెల్లూరు జిల్లా నాయకులు ఎం. మోహన్ రావు పిలుపునిచ్చారు.

ఏ.పీ అంగన్వాడి వర్కర్స్ %డ%హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఉలవపాడు ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె లో భాగంగా 18వ రోజు సమ్మె శిభిరం వద్ద ఈరోజు సాయంత్రం ప్రభుత్వవిధానాలు-అంగన్వాడీలపై ప్రభావం అనే అంశంపై స్టడిసర్కిల్ జరిగింది. ఈ స్టడీ సర్కిల్ కు ముఖ్య వక్తగా ఎం మోహన్ రావు పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాము అధికారంలోకి రావడానికి ప్రజలకు, ఉద్యోగులకు హామీలు ఇచ్చిందని , అందులో భాగంగానే అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామని ప్రకటించారని గుర్తు చేశారు. మీరు ఇచ్చిన హామీలను అమలు చేయమని అంగన్వాడీలు అడుగుతుంటే, మేమింత వరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లలేదని మంత్రుల బృందం చర్చలలో చెబుతున్నారంటే, ఇంతకన్నా సిగ్గుచేటు అయిన విషయం మరొకటి లేదు అని ఆయన అన్నారు. ఇన్ని రోజులుగా అంగన్వాడీలు ఉద్యమం జరుగుతున్న కూడా కళ్ళు ఉన్న కబోది పక్షి లా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతన సవరణ కోసం, ఈ నాలుగున్నర యేండ్ల కాలంలో సమావేశం కావడానికి రాష్ట్ర ప్రభుత్వానికి తీరిక లేదా, లేదా అంగన్వాడీలు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి వివక్ష అని అన్నాడు . ఒక కుటుంబం బ్రతకాలంటే రాష్ట్ర ప్రభుత్వమే కనీస వేతనం 18వేలుగా నిర్ణయించింది. మరి మీరు నిర్ణయించిన వేతనం ఇవ్వాలంటే, మీకు వస్తున్న అడ్డంకి ఏంటి అని ప్రశ్నించారుసమానపనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెబుతుంటే అంగన్వాడీలలో వివక్షత చూపిస్తూ ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు కోర్టుల మీద ఈ రాష్ట్ర ప్రభుత్వానికి నమ్మకం లేదని ఈ రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు ధిక్కారం ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్చలు జరిపి, సమ్మె పరిష్కరించాలని ఆయన డిమాండ్ కోరారు. లేనట్లయితే ప్రభుత్వానికి తగిన గుణపాఠం




చెబుతారని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు మాట్లాడారు

వేదికపైనున్న సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీకుమార్, అంగన్వాడీ యూనియన్ ఉలవపాడు ప్రాజెక్టు లీడర్లు సి.హెచ్.ఇందిరావతి,వాకా. లతారెడ్డి,ప్రముఖ విద్యావేత్త ఎస్.కే. మెహర్ అలీ ఉన్నారు.ఈ ఆందోళన లో సిఐటీయూ గుడ్లూరు అధ్యక్షులు ఎస్.కె.పద్మజ, మూడు మండలాల సెక్టార్ లీడర్లు పర్రె.తిరుపతమ్మ, కామాక్షమ్మ,పి.రమణ,యం. పద్మ, అంగన్వాడీ లు సిహెచ్ పద్మజ, కత్తి బుజ్జమ్మ, గీత,పి. ధనలక్ష్మి,కే. శైలజ,డి.వరలక్ష్మి,బి.సుస్మిత,శేషమ్మ,భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ఆశీర్వదించండి ఆగిన అభివృద్ధిని కొనసాగిస్తా

-వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

-నాడు అభివృద్ధి చేసింది మనమే రేపు అభివృద్ధి చేసేది మనమే

-రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాలి

- బొల్లినేని వెంకట రామారావు



ఉదయగిరి,
ఆశీర్వదించండి ఆగిన అభివృద్ధిని కొనసాగిస్తానని మాజీ శాసనసభ్యులు ఉదయగిరి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. ఆయన ఉదయగిరి పట్టణంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ప్రజా దీవెన యాత్ర లో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో శాసన సభ్యులుగా నేను ఉదయగిరి నియోజకవర్గంలో 3600 కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని ఈ ఐదేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. నాడు చేసిన అభివృద్ధి కంటే రేపు ఉదయగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఇంటింటికి తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారికి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. టిడిపి జనసేన మేనిఫెస్టోని వివరిస్తూ అధికారంలోకి వస్తే జరిగే లబ్ధిని వివరించారు మరియు యువత కోసం ఉదయగిరిలో ఇండోర్ స్టేడియం తీసుకువస్తే దానిని వైసిపి ప్రభుత్వం ఆపేసిందన్నారు . ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు బయన్న మైనార్టీ సెల్ నాయకులు రియాజ్ ఎస్సీ సెల్ నాయకులు నల్లిపోగు నరసింహులు, యూనిట్ ఇంచార్జ్ ఓబుల్ రెడ్డి, ఆర్య వైశ్య నాయకులు గూడూరు వెంకటేశ్వరావు మరియు తదితరులు పాల్గొన్నారు.

# డిప్లమా ఇన్ జర్నలిజం కోర్సులో ఉత్తీర్ణులైనవారికీ సర్టిఫికెట్లు అందజేత.

**-ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు..**

ఆలమూరు (విజయవాడ)
నేటి ఆధునిక ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జర్నలిజం రంగం పై అవగాహన లేని ఎంతోమంది జర్నలిస్టులుగా ఎదుగుతుండటం జరుగుతుందని అటువంటివారు జర్నలిజం వాటి విలువలపై కనీస అవగాహన పెంచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ అభిప్రాయపడ్డారు. సి . రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలు సంయుక్తంగా నిర్వహించి డిప్లమా జర్నలిజం కోర్సు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు ప్రధాన కార్యక్రమం శుక్రవారం యూనివర్సిటీలో డెక్ మ్యాన్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. రచన శైలితో ఎన్నో అద్భుతాలు సాధించవచ్చు అన్నారు. అలాగే మరొక ముఖ్యఅతిథిగా పాల్గొన్న అధికార బాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు మాట్లాడుతూ ప్రజల జీవన స్థితిగతులు,మెరుగు జీవన ప్రమాణాలు పెంచేందుకు మీడియా ఒక ప్రతినిధిగా ఉండాలని, సమాజాన్ని మార్చే ఏకైక ఆయుధం మీడియా అని తెలియజేసారు. అనంతరం డిప్లమా ఇన్ జర్నలిజం కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గానికి చెందిన ప్రముఖ జర్నలిస్టులు కర్రీ పూర్ణరెడ్డి విశాలాంధ్ర(ఆలమూరు), అలాగే పెన్ పవర్ పత్రికలో పనిచేస్తున్న అత్తిలి చిరంజీవి(ఆత్రేయపురం),బొక్క తమ్మరాజు (రావులపాలెం), దంగేటి వెంకటేశ్వరరావు (కొత్తపేట) వడ్డి గంగాధర్ (ఆలమూరు),మరో అభ్యర్థి కొలపత్తి సురేష్ కలవచర్ల గ్రామానికి చెందిన వారికీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్యూ జర్నలిజ విభాగాధిపతి డాక్టర్ జి.అనిత, కోర్సు కోఆర్డినేటర్ ఎల్వి కృష్ణారెడ్డి,ఏ ఎన్యూ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, ద హిందూ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డెం అప్పాజీ,ఏఎన్యూ పరీక్షల నిర్వహణ అధికారి భీమిరెడ్డి నరసారెడ్డి,రెడ్డి ప్రకాశరావు, మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్,మీడియా సోదరులు,తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి పనుల్లో మేట్‌లు కీలకం

వలేటివారిపాలెం
జాతీయ ఉపాధి హామీ పథకం లో కూలీలకు పనుల కల్పనలో మేట్ లు కీలకంగా వ్యవహరించాలని ఏపిడి సంజీవరావు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరక్టర్ ఆదేశాల మేరకు ఏ పి ఓ ఉమా మహేష్ ఆధ్వర్యంలో మహిళా మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిడి సంజీవరావు మాట్లాడుతూ పనికి డిమాండ్, మస్టర్ నిర్వహణ, ఎన్ ఎం ఎంఎస్ యాప్ హాజరు, పని ప్రదేశంలో ఇచ్చే కొలతలపై మేట్ లు అవగాహణతో ఉండాలన్నారు అన్నయ్యకు శిక్షణా కార్యక్రమం లో అవగాహన కల్పించామని చెప్పారు. క్లష్టర్ ట్రెనింగ్ ఆఫీసర్ రాజ్ కుమార్ ఉపాది హామి సిబ్బంది, మెట్లు పాల్గొన్నారు.

# ఏపీ బీసీ,ఓబీసీ ఉద్యోగ సంఘాల క్యాలెండర్ ఆవిష్కరణ.

**-ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అధ్యక్షతన.**



ఆలమూరు
మండల కేంద్రమైన ఆలమూరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నందు ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అధ్యక్షతన, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ కమిటీ చైర్మన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ,ఓబీసీ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం, అధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక తహశీల్దార్ ఐపీ శెట్టి హాజరై బిసి, ఓబీసీ 2024 నూతన సంవత్సర క్యాలెండర్ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ,ఓబీసీ ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న సేవాకార్యక్రమాలు ముందు తరాలవారికి ఆదర్శంగా నిలవాలని,ప్రతి రంగంలోని బీసీ ఉద్యోగులు ఎంతగానో పాటుపడుతున్నారని, ప్రజలకు మరింత చేరువ కావాలంటే ఉద్యోగుల కష్టపడి పని చేయాలన్నారు. అలాగే ఉద్యోగుల సమస్యలను కూడా సంఘం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని బీసీ,ఓబీసీ సంఘాల ఉద్యోగులు, రిటైర్మెంట్ ఉద్యోగుల, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివారం పోతురాజు స్వామి గుడి వద్ద నెల పొంగళ్ళు.





కందుకూరు,
కందుకూరు పట్టణంలోని పోతురాజు స్వామి వారి గుడి వద్ద నెల పొంగళ్ళు కార్యక్రమం జరుగుతుందని గ్రామ దేవతల వారసత్వ ధర్మకర్త దివి లింగయ్య నాయుడు తెలిపారు. ఈ నెల 31 ఆదివారం ఉదయం పది గంటలకు ముత్తరాశి పాలెం ఆచార దేవర ఇంటి వద్ద మొదలై పోతురాజు స్వామి గుడి వద్ద పొంగళ్ళు చెల్లించెదరని చెప్పారు. అనంతరం ఆచారవంతులకు ధీను బండారు కార్యక్రమం నిర్వహించెదరని అన్నారు. ఇటీవల నాగవాస శిలల పునఃప్రతిష్ఠా జరిగి నందున నెల పొంగళ్ళు కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. కావున పోతురాజు స్వామి వారి ఆచారవంతులు, భక్తులు పాల్గొన వలసినదిగా కోరారు.
-దాతల సాయం మరువలేనిది.
ఈ సందర్భంగా పోతురాజు స్వామి గుడి వద్ద అభివృద్ధికి సహాయ సహకారం అందిస్తున్న అముదాల పల్లి ఆదినారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడికొండ శివకుమారి ఇరువురికి దివి లింగయ్య నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. గుడి వద్ద గ్రానైట్, స్టీల్ రైలింగ్, మరియు బోరు, పార్కింగ్ టైల్స్ ఏర్పాటుకు సహకారం అందించారని వారిని అభినందించారు. నూతనంగా ఏర్పాటు చేసిన నీటి బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో మాదాల మాల్యాద్రి, పల్నాటి చెన్నయ్య, మంగపాటి కృష్ణయ్య, గుర్రం మల్లిఖార్జున, ఆదినారాయణ, గోవర్ధన్, పంది మాల్యాద్రి, గుబ్బరబోయిన రామరాజు, రంగయ్య లు పాల్గొన్నారు.

# ఉద్యమ సహాయ నిధి కింద పదివేల రూపాయలు అందజేసిన యూటీఎఫ్ కార్యకర్తలు.



గుడ్లూరు,
గత మూడు నెలలుగా జీతాలు అందక, ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీల అమలు కోరుతూ గత కొన్ని రోజులుగా కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యమ బాట పట్టారుఉద్యమ బాట పట్టిన కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి తమ సంఘీభావం తెలియజేస్తూ వారికి ఉద్యమ సహాయనిధిగా మండలంలోని యూటీఎఫ్ కార్యకర్తలు అందించిన పదివేల రూపాయలు మొత్తాన్ని వారికి గుడ్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి వి రామ్మోహన్ మరియు యూటీఎఫ్, గుడ్లూరు మండల శాఖ బాధ్యులు అందించడం జరిగింది. కార్యక్రమంలో మండల శాఖ బాధ్యులు జె వెంకటాద్రి నాయుడు, ఎం రమేష్ బాబు, షేక్ రసూల్ బాషా, ఎస్ ప్రసన్న కుమారి, జి చిన్న కొండయ్య ,చల్ల శ్రీనివాసులు, యు రవికుమార్, పి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాలకొండ ఆదాయం రూ 86,79,136



వలేటివారిపాలెం,
మండలంలోని మాలకొండ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.86,79,136లు ఆదాయంగా సమకూరిందని ఆలయ సహాయ కమిషనరు కేబీ శ్రీనివాస రావు తెలిపారు. శుక్రవారం పర్యవేక్షణ అధికారి బైరాగి చౌదరి ఆధ్వర్యంలో ఆలయంలోని హుండిలను తెలిసి కానుకలను లెక్కించడం జరిగిందన్నారు. భక్తులు 13 వారాలు పాటు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూ. 86,79,136, బంగారం 310 గ్రాములు, వెండి 1845 గ్రాములు, యు ఎస్ డాలర్స్ 54, కెనడా డాలర్స్ 10, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, ఆస్ట్రేలియా డాలర్స్ 5 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై బి మహేంద్ర నాయక్, అయ్యవారిపల్లె సర్పంచ్ దేగా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# అంకమ్మ తల్లి దేవస్థానం శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



కందుకూరు,
మండలంలోని మాచవరం గ్రామం కొండపై శ్రీ శ్రీ శ్రీ అంకమ్మతల్లి దేవస్థానం శంకుస్థాపన మహోత్సవం శుక్రవారం ఉదయం 8.37 నిముషాలకు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి మరియు అంకమ్మ తల్లి భక్తులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు.

# ముస్లిం యువత రాజకీయాల్లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఎస్ డి పి ఐ ఆకాంక్ష.



కందుకూరు,
అన్నీ రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా ముస్లీం యువత రాణించాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా కందుకూరు నియోజకవర్గం ప్రెసిడెంట్ షేక్ ముజీబ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. సామాజిక ఆర్థిక సాంస్కృతిక రంగాలలో రాణిస్తూనే రాజకీయాలు అవగాహన చేసుకోవాలి అని అన్నారు ఈమధ్య వైయస్సార్ సిపి పార్టీ తరపున యువజన విభాగం జిల్లా సెక్రటరీగా ఎన్నికైన షేక్ మహబూబ్ బాషా కు అభినందనలు తెలియజేశారు మరింత ఉన్నత స్థాయి కి ఎదగాలని కోరుకుంటూ దుశ్శాలువను కప్పి మిఠాయిలు పంచిపెట్టారు ఈకార్యక్రమం షేక్ రసూల్, షేక్ సలీం, షేక్ మాబూబ్ బాషా, షేక్ మునాఫ్, షేక్ జాహిద్, షేక్ మసూద్, షేక్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.